

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 352 ఎడిటర్: కె.యువరాజ్ శుక్రవారం 2-10-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు


## ఎమ్మెల్సీ పదవులు ఎవరిని వరించునో!?

**- వచ్చే నెలలో 3 గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ - ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ.. పరిశీలనలో నలుగురి పేర్లు - మిగిలిన సీట్లలో ఒకటి ఎస్సీకి, మరోటి బ్రాహ్మణ నేతకు...**



**హైదరాబాద్, అక్టోబర్ 1 (వన్‌నేషన్):** త్వరలో ఖాళీ కానున్న మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లలో ఒకటి పద్మశాలీ నేతకే ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఆ సామాజిక వర్గం నేతల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సీటు దక్కించుకునేందుకు ఇప్పటికే తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. తమ పేర్లనూ పరిగణనలోకి తీసుకోవాలంటూ ముఖ్య నాయకులకు ఫోన్లు చేస్తున్నారు. పద్మశాలీ వర్గానికి కేటాయించే సీటుకు ప్రధానంగా కుడా చైర్మన్ గుండు సుధారాణి, ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఈరవత్రి అనిల్, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కైల్ల?షనేత పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్ పదవీ కాలం నవంబర్ 14న ముగియనున్న సంగతి తెలిసిందే. ఈ మూడు సీట్లలో ఒకటి పద్మశాలీ నేతకు కేటాయించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మిగిలిన రెండు సీట్లలో ఒకటి ఎస్సీ వర్గానికి, రెండోది బ్రాహ్మణ వర్గానికి కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఎస్సీల్లోనూ మాదిగ సామాజికవర్గానికి కేటాయించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, పార్టీ నేత దొమ్మాట సాంబయ్య పేర్లు పరిశీలనలో

3లో



## గొడ్డలి పార్టీకి బీసీలంటే ద్వేషం

**- అందుకే కోర్టులో వ్యాజ్యాలతో కుట్రలు - 34 శాతం రిజర్వేషన్లకు మోకాలడ్డారు: బాబు - రేపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి వెల్లడి - స్వయంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ**

**బాపట్ల, అక్టోబర్ 1 (వన్‌నేషన్):** తెలుగుదేశం పార్టీకి 45 ఏళ్లుగా అండగా నిలిచిన బీసీలకు న్యాయం చేసే బాధ్యత ఎన్డీఏతో పాటు టీడీపీ తీసుకుంటుందని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. బీసీలపై ఉన్న ద్వేషంతోనే గొడ్డలిపార్టీ రిజర్వేషన్లపై కుట్రలు పన్ని పిటిషన్లు వేయించి అడ్డు తగిలిందని మండిపడ్డారు. "ఏది ఏమైనా వెనకబడిన వర్గాలను కాపాడుకుంటాం. రాజకీయంగా వారిని పైకి తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటాం." అని చంద్రబాబు ప్రకటించారు. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకమే వెయ్యేనుగుల బలమని వ్యాఖ్యానించారు. పేదల సేవలో.. పథకంలో భాగంగా బాపట్ల జిల్లా రేపల్లెలో గురువారం జరిగిన 'ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తుండగానే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టేసిన అంశం ఆయనకు తెలిసింది. దీనిపై సీఎం వెంటనే స్పందించారు. బీసీల రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకే గొడ్డలిపార్టీ పిటిషన్ల పేరుతో కుట్రలకు తెర తీసిందని మండిపడ్డారు. రిజర్వేషన్ల అంశంపై శుక్రవారమే అత్యున్నత న్యాయస్థానాన్ని (సుప్రీంకోర్టు) ఆశ్రయిస్తామని ప్రకటించడంతో పాటు, గొడ్డలిపార్టీ వైఖరిపై మండిపడ్డారు. మెగా డీఎస్సీని యజ్ఞంలా నిర్వహించి, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తే, వాటిపై కూడా 350 కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. ఇప్పుడు వెనకబడిన వర్గాలపై ద్వేషంతో కోర్టుకెళ్లి, వారికి దక్కాల్సిన రిజర్వేషన్లకు అడ్డు తగిలారన్నారు. పల్లె

2లో

## హనుమాస్కుంట చెరువు అభివృద్ధికి వెంటనే చర్యలు తీసుకోవాలి: వజ్రేష్ యాదవ్

**- హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేత**



**మేడ్చల్,మేడిపల్లి /అక్టోబర్ 01/వన్ నేషన్ :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్‌లో ఉన్న చారిత్రక హనుమాస్కుంట చెరువు అభివృద్ధి, పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ... హనుమాస్కుంట చెరువు స్థానిక ప్రజలకు ఎంతో ప్రాధాన్యత కలిగిన ముఖ్యమైన జలవనరు అని గుర్తుచేశారు. చెరువు అభివృద్ధి పనులతో పాటు పరిసర ప్రాంతాల సుందరీకరణ, కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, అంతేకాకుండా చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా అధికారులు దృష్టి సారించాలని కోరారు. చెరువు పరిధిలో ఏవైనా ఆక్రమణలు లేదా మురుగునీటి సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చెరువును సమగ్రంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని హైడ్రా అధికారులను కోరారు. ప్రజల తాగునీరు, సాగునీరు మరియు పర్యావరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హనుమాస్కుంట చెరువు పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి, పుల్లకండ్ల జంగారెడ్డి, పుల్లకండ్ల వెంకట్ రెడ్డి, పుల్లకండ్ల రాజి రెడ్డి, సింగిరెడ్డి రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దసరా కానుక!

**ఉద్యోగులకు 2 డీఏలు చెల్లింపునకు ఆమోదం**

**- ప్రభుత్వంపై ఏటా 2,500 కోట్ల రూపాయల భారం - రాష్ట్రంలో 235 మండలాల్లో కరువు పరిస్థితులు..- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు.. - మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి వెల్లడి**

**హైదరాబాద్, అక్టోబర్ 1 (వన్‌నేషన్):** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దసరా కానుకగా రెండు కరువు భత్యాల(డీఏ)ను ప్రకటించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటిని విడుదల చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రెండింటి బకాయిలను వాయిదాల్లో చెల్లిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా సాగింది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఆర్థికంగా భారమైనప్పటికీ ఉద్యోగ సంఘాలతో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మంజూరు చేయడానికి అంగీకరించారని తెలిపారు. దీంతో ఏటా రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2500 కోట్ల భారం పడుతుందని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల్లో పాల్పంచుకుంటున్న ఉద్యోగులు, వారి కుటుంబాలు కూడా సంతోషంగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ డీఏలను ఆమోదించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నినో పరిస్థితులపై క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ వానాకాలంలో 17 శాతం వర్షపాతం లోటు ఉందని నిర్ధారించారు.


వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని





అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల
వ్యాప్తంగా జిల్లాలు, మండలాల
వారీగా పనిచేసే విలేకరులు
కావలెను.

9948222240

# అన్నదమ్ముల మధ్య ఘర్షణలో మృతి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త

## కుటుంబానికి అండగా రాజీవ్ రెడ్డి

**ఎమ్మిగనూరు అక్టోబర్ 1 ఎ౦ యూసుఫ్ (వన్ నేషన్):** గోనెగండ్ల మండలం గోనెగండ్ల గ్రామంలో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో మృతి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త కురువ రంగడు (40) కుటుంబాన్ని వైఎస్సార్సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి పరామర్శించారు. నిన్నటి రోజున





ఘర్షణ లో మృతి చెందిన కురువ రంగడు గారి పార్థివదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రాజీవ్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రంగడు గారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు వెల్లడించిన వివరాలను గోనెగండ్ల సీఐ దృష్టికి రాజీవ్ రెడ్డి తీసుకెళ్లారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిందితులు ఎవరైనా సరే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సీఐ గారిని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోనెగండ్ల మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్సూర్, మాజీ వం సింగిల్ విండో డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ వాలంటీర్స్ విభాగ అధ్యక్షుడు ఎస్.కే. బాబూలాల్, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

## జాతీయ బిసి బహుజన ఫ్రంట్ అధ్యక్షులు తాటికొండ నరసింహారావు

**గుంటూరు, అక్టోబర్ 1 (వన్‌నేషన్):** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్స్ అమలకై ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 105, 1065 లను మొత్తం రిజర్వేషన్స్ 59 శాతానికి మించకూడదన్న ఏపీ హైకోర్టు ధర్మాసనం కొట్టివేయటం రాజ్యాంగ స్ఫూర్తి కి సహజ న్యాయ సూత్రానికి విరుద్ధం అని జాతీయ బిసి బహుజన ఫ్రంట్ అధ్యక్షులు తాటికొండ నరసింహారావు అన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా తమిళనాడులో ఏ విధముగా 69% రిజర్వేషన్లు అమలు జరుగుతున్న విధముగా ఏపీలో కూడా రాజ్యాంగ సవరణ చేసి రిజర్వేషన్స్ అమలు చేయాలని నరసింహారావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కోసం పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టేందుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై ఒత్తిడి తేవాలని, ఏపీ నుండి ఒక ప్రతినిధి బృందాన్ని నరేంద్ర మోడీ వద్దకు ఢిల్లీ పంపి యుద్ధ ప్రాతిపదికన రాజ్యాంగ చేయించి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషిచేయాలని తాటికొండ నరసింహారావు విజ్ఞప్తి చేశారు. నేడు గుంటూరు లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశం లో పాల్గొన్న వారిలో అద్దంకి రవి కె భతేశ్వరావు వై లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



## రియల్ ఎస్టేట్ పెట్టుబడి అవకాశాలను భారతీయులకు పరిచయం చేస్తూ

# ఫ్లోటన్ ఆఫ్రికా హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రెస్‌మీట్

**హైదరాబాద్, అక్టోబర్ 1 (వన్‌నేషన్):** టాంజానియాలోని జాంజిబార్‌లో రియల్ ఎస్టేట్ పెట్టుబడి అవకాశాలను భారతీయులకు పరిచయం చేస్తూ ఫ్లోటన్ ఆఫ్రికా హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రెస్‌మీట్ నిర్వహించింది. జాంజిబార్ ప్రశాంతమైన వాతావరణంతో పాటు పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాల్లో అభివృద్ధి చెందుతున్న గమ్యస్థానంగా ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.తెలంగాణకు చెందిన పారిశ్రామికవేత్త, ఫ్లోటన్ ఆఫ్రికా డైరెక్టర్ సప్నా బ్రహ్మారౌతు నేతృత్వంలో సంస్థ జాంజిబార్‌లో పలు ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించింది. ది ఎమరాల్డ్ అట్ పాజే, ఎమరాల్డ్ స్క్వేర్, రివోరా బీచ్ క్లబ్ & రెసిడెన్సెస్, హోలా పాజే, యోలో రెసిడెన్స్ వంటి ప్రాజెక్టులను సంస్థ పరిచయం చేసింది.భారతీయ పెట్టుబడి దారులకు జాంజిబార్‌లోని రియల్ ఎస్టేట్ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఫ్లోటన్ ఆఫ్రికా డైరెక్టర్లు సప్నా బ్రహ్మారౌతు, రవీంద్రన్ జయరామ్ పాల్గొన్నారు.







# నల్లా నర్సింహులు గారి 100వ జయంతి

**జనగామ, అక్టోబర్ 1 (వన్‌నేషన్):** నల్లా నర్సింహులు గారి 100వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహిద్దామని మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు అన్నారు. కటకం నర్సింగ్ రావు మాట్లాడుతూ, రైతన్నల హక్కుల కోసం భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, పోరాడిన రైతాంగ సాయుధ పోరాట యోధులు నల్లా నరసింహులు గారి 100వ జయంతిని ఘనంగా మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో జనగామ పట్టణంలో విస్తృత ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కుల సంఘ నాయకులు, బీసీ ఉద్యమకారులు విద్యావంతులు కవులు,రచయితలు, మేధావులు, ఇంటలెక్చువల్స్, రాష్ట్రం నలుమూలల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి ఆ యొక్క 100వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిద్దాం. నల్లా నరసింహులు గారు భూమికోసం, భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి, కోసం సాగించిన పోరాటం చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. దొరల అహంకారం, దోపిడి, అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడి, రైతులు మరియు పేదవారి హక్కుల కోసం, వెట్టి చాకిరీముక్తి కోసం సాగిన పోరాటం చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలిచింది. రైతులు పేద ప్రజల హక్కుల కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన గొప్ప యోధుడు రైతంగ పోరాట యోధుడు నల్లా నర్సింహులు గారిని తెలంగాణ వ్యాప్తంగా పరిచయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని కటకం నర్సింగ్ రావు



అన్నారు. పెద్దవూరే బ్రహ్మయ్య మాట్లాడుతూ, నల్లా నరసింహులు గారు ఏ కులానికి వర్గానికో మతానికో సంబంధించిన నాయకుడు మాత్రమే కాదు, ప్రజల హక్కుల కోసం పోరాడిన ఆదర్శ యోధుడు, ఆయన చరిత్రను గ్రామానికి, వాడవాడలా, మండలానికి, పట్టణాలలో, తీసుకెళ్లి యువతకు భవిష్యత్ తరాలకు పరిచయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంధి.నల్లా నర్సింహులు జీవితం పోరాటం,త్యాగం, ప్రజా ఉద్యమాలకు ఆయన అందించిన స్ఫూర్తి గురించి లోతుగా అధ్యయనం చేసి ఈ చరిత్రను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవసరం ఎంతైనా ఉందని మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూరే బ్రహ్మయ్య అన్నారు.

## బుల్లి తెర నటి రష్మీ గౌతమ్ తో

# మాంగళ్య షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

**మేడిపల్లి /అక్టోబర్ 01/వన్ నేషన్ :** మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ లోని పలని కన్వెన్షన్ హాల్లో మాంగళ్య షాపింగ్ మాల్ యాజమాన్యం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'ఎగ్జిబిషన్ అండ్ సేల్' గురు వారం అట్టహాసంగా ప్రారం భమైంది. ప్రముఖ నటి రశ్మి గౌతమ్ ఈ కార్యక్రమాని కి ముఖ్య అతిథిగా విచ్చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.ఈ ప్రదర్శన అక్టోబర్ 1వ తేదీ నుంచి 18వ తేదీ వర కు కొనసాగనుంది. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని వివిధ ప్రాంతా ల నుంచి ప్రత్యేకంగా సేకరించిన నూతన వస్త్ర కలెక్షన్ల ను ఒకే వేదికపై అందుబా టులో ఉంచారు.మహిళలు, పురుషులు, చిన్నారులంద రి కోసం ఆకర్షణీయమైన డిజైన్లు, విభిన్న రకాల వస్త్రాలు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.




### రూ.99 నుంచే చీరల ప్రత్యేక సేల్:

ఈ సేల్‌లో భాగంగా వినియోగదారుల కోసం అతి తక్కువ ధరలకే వస్త్రాలను అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా రూ.99 నుంచే చీరల ధరలు ప్రారంభమవు తాయని వెల్లడించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి, నూతన కలెక్షన్లను తిలకిస్తూ తమకు నచ్చిన దుస్తులను సులువుగా కొనుగోలు చేయడానికి ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

### ప్రజలకు చేరువగా ప్రత్యేక ఎగ్జిబిషన్లు:

సాధారణ షాపింగ్ మాల్స్‌లోనే కాకుండా, ప్రజల చెంతకే నేరుగా వెళ్లి ఇలాంటి ప్రత్యేక ఎగ్జిబిషన్లు నిర్వహించడం ప్రస్తుతం సరికొత్త ట్రెండ్‌గా మారుతోందని నిర్వాహకులు తెలిపా రు. ఏఎస్ రావునగర్‌లో తొలిసారిగా ఇలాంటి ప్రదర్శన విజయవంతంగా నిర్వహించిన స్ఫూర్తితో, రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లోనూ వీటిని విస్తరించాలని నిర్ణయించిన ట్లు వెల్లడించారు. స్థానికం గా ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ వేదికలను ఏర్పాటు చేయడం ద్వారా కుటుంబంతో కలిసి సంతోషంగా షాపింగ్ చేసే అవకాశం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గొడ్డలి పార్టీకి బీసీలంటే ద్వేషం

పండగ కార్యక్రమంలో భాగంగా రూ. వేల కోట్లను ఖర్చు చేస్తున్నామని, రోడ్డుపై గుంతలు కనపడితే అధికారులను ఉపేక్షించేది లేదని, నూతనంగా రోడ్డు డాక్టర్ విధానాన్ని తీసుకొస్తామన్నారు. "రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులను సైతం గొడ్డలిపార్టీ రాజకీయం చేస్తోంది. నేను వరుణ దేవుణ్ణి ప్రార్థించాను. ఆ తర్వాత 24 గంటల్లోనే విశాఖపట్నం సహా పలు ప్రాంతాల్లో 27 సెంటిమీటర్ల వర్షం కురిసింది. మన సంకల్పం మంచిదైతే దేవుడు మనతోనే ఉంటాడనడానికి ఇదే నిదర్శనం. అడ్డుకుంటే ఆగేదే లేదు. నాయకుడిగా ప్రజల రేపటి భవిష్యత్తు గురించే ఆలోచిస్తాను. ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను కేవలం డబ్బుల పంపిణీగానే చూడడం లేదు. వారి జీవితాలకు భరోసా ఇవ్వడంతో పాటు, ఆర్థిక అసమానతలు తొలగించి, మంచి భవిష్యత్ ఇవ్వడానికి మార్గంగా చూస్తున్నాం. పింఛన్ల కోసం ఇప్పటివరకు రూ.76,000 కోట్లు ఖర్చు పెట్టాం. ఈ సంవత్సరం ఇప్పటి వరకు రూ.33,000 కోట్లు అందించాం. కష్టాలున్నా పారిపోవడం లేదు. అధిగమిస్తున్నాం. పోలవరం మొదటి దశను వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తి చేసి కృష్ణానదితో అనుసంధానం చేసి, డెల్టాలకు నీటి సమస్యే లేకుండా అన్‌స్టాపబుల్ చేస్తా. పోలవరంతో పాటు 35 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుడుతున్నాం". "తాజా సర్వే రిపోర్టుల్లో గొడ్డలిపార్టీ పరపతి దిగజారిపోయింది. ఎన్డీయే పరపతి పైకి ఎగబాకింది. అసెంబ్లీ మీద అలిగిన పార్టీకాదు.. ప్రజలే మాకు ప్రతిపక్షంగా పనిచేస్తున్నాం. మేమంతా ప్రజలకు సేవకులం తప్ప పెత్తందార్లం కాదు. సుదీర్ఘకాలం పాటు ఒకే పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు కానీ, దేశాలు కానీ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచాయి.

# నూతన షోరూమ్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి



**ఎల్బీనగర్ ప్రతినిధి, అక్టోబర్ 1 (వన్ నేషన్):** నాణ్యత, విస్తృతమైన కలెక్షన్లు, వినియోగదారుల సంతృప్తి కి ప్రాధాన్యమిస్తూ వస్త్ర రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీఎంఆర్ షాపింగ్ మాల్ మరో నూతన షోరూమ్‌ను హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో గురువారం ఘనంగా ప్రారంభించింది. నూతన షోరూమ్ ప్రారంభంతో వనస్థలిపురం, ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు కుటుంబ సమేతంగా షాపింగ్ చేసుకునేలా విస్తృతమైన వస్త్ర, ఫ్యాషన్ కలెక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. సీఎంఆర్ షాపింగ్ మాల్ నూతన షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆమె రాకతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సినీ నటి మీనాక్షి చౌదరిని చూసేందుకు ఆసక్తి చూపారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్ చైర్మన్ మావూరి వెంకట రమణ, డైరెక్టర్ మావూరి బాలాజీ పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎల్బీనగర్ బీజేపీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, ల్యాండ్‌గార్డ్, మాజీ కౌన్సిలర్, యాదగిరిగుట్ట బోర్డు మెంబర్ పి. ఈశ్వరమ్మ యాదవ్, షోరూమ్ యజమాని పి. కృష్ణ యాదవ్, సురేష్ యాదవ్ తదితరులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. షోరూమ్ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ సీఎంఆర్ షాపింగ్ మాల్‌లోని చీరల కలెక్షన్లు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. తాను కూడా క్రమం తప్పకుండా సీఎంఆర్‌లో షాపింగ్ చేస్తుంటానని వెల్లడించారు. విభిన్న డిజైన్లు, ఆకర్షణీయమైన కలెక్షన్లు ఉండటం తనకు ఎంతో నచ్చుతుందని పేర్కొన్నారు. వనస్థలిపురం ప్రజలకు తనపై ఎంతో అభిమానం ఉందని, అదే విధంగా తనకూ ఇక్కడి ప్రజలంటే ఎంతో ఇష్టమని మీనాక్షి చౌదరి తెలిపారు. స్థానిక ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ వేదికపై ఉత్సాహంగా మాట్లాడారు. అనంతరం వేదికపైనే పాటలకు నృత్యం చేస్తూ ప్రేక్షకులను అలరించారు. దీంతో ప్రారంభోత్సవ వేడుకలో సందడి మరింత పెరిగింది.

# ఉప్పల్ లో మాంగళ్య షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్ సేల్ గొప్ప ప్రారంభం



**ఉప్పల్, అక్టోబర్ 1 (వన్ నేషన్):** 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది.

ఈ క్రమంలో ఉప్పల్ లో ఎగ్జిబిషన్ సేల్ ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ యాంకర్ రష్మి గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరై, దీప ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎగ్జిబిషన్ వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. బతుకమ్మ, దసరా పండుగలకు పెద్ద ఎత్తున కలెక్షన్ ఏర్పాటు చేయడం తో ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ప్రజలు అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. రిబ్బన్ కటింగ్ అనంతరం రశ్మీ గౌతమ్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉంది. వారి ఆశీర్వాదా లతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుంది" అని అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ "ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యం" అని తెలిపారు.

"మా స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం" అని పేర్కొన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ ఎగ్జిబిషన్ ప్రారంభంతో ఉప్పల్ ప్రాంత ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చు. రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోంది.



# షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్



**ఎల్బీనగర్ ప్రతినిధి, అక్టోబర్ 1 (వన్ నేషన్):** వనస్థలిపురం పనామా గోడౌన్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు,తదితర నాయకులు హాజరయ్యారు.

## ఎంపీ వద్దిరాజు మనుమరాలు తారిణి పుట్టినరోజు సందర్భంగా ఆశీస్సులు అందజేసిన

# కేటీఆర్, హరీష్ రావు తదితర ప్రముఖులు



**మహేశ్వరం, అక్టోబర్ 1 (వన్ నేషన్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మనుమరాలు తారిణి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతుల కుమారుడు-కోడలు నిఖిల్ చంద్ర-అనీల దంపతుల చిన్న కూతురు తారిణి పుట్టినరోజు సందర్భంగా గురువారం రాత్రి మహేశ్వరం మండలం మన్సాన్ పల్లిలోని ఎన్విరాన్ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ తన్నీరు హరీష్ రావు,మాజీ మంత్రులు గంగుల కమలాకర్,గుంటకండ్ల జగదీష్ రెడ్డి,జోగు రామన్న, పువ్వాడ అజయ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్,దానం నాగేందర్,గంటా శ్రీనివాసరావు,ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు,ఎంపీలు డాక్టర్ కోవ లక్ష్మణ్,దీవకొండ దామోదర్ రావు,శివదాసన్ (కేరళ), ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్ రావు, డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్,ఎల్.రమణ, ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్,పాడి కౌశిక్ రెడ్డి,కాలేరు వెంకటేష్,కొత్త ప్రభాకర్ రెడ్డి, కూనంనేని సాంబశివరావు,మాజీ ఎంపీలు కే.ఆర్.సురేష్ రెడ్డి,మాలోతు కవిత,గుండు సుధారాణి,పసునూరి దయాకర్, బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు హాజరై అక్షింతలు వేసి తమ ఆశీస్సులు అందజేశారు.

# కాంగ్రెస్ పార్టీ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం



**బాలాపూర్, అక్టోబర్ 1 (వన్‌నేషన్):** కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల సమక్షంలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు మరియు రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అల్మాస్‌గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్ ప్రాంతాలకు చెందిన పలువురు క్రియాశీలక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ పార్టీ పదవులు మరియు నామినేటెడ్ పదవులకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని నాదర్‌గుల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో, ఏపీఆర్‌ఆర్ గార్డెన్ లో నిర్వహించడం జరిగింది.

పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు మరియు రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు తమ దరఖాస్తులను పార్టీ అధిష్టానం మరియు నియోజకవర్గ ఇన్‌చార్జి నాయకత్వానికి సమర్పించారు.



పార్టీ అవసరాలు, నాయకులు మరియు కార్యకర్తల సేవలు, వారి అనుభవం, పార్టీ పట్ల నిబద్ధత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ అధిష్టానం తగిన నిర్ణయాలు తీసుకోనుంది. ఈ కార్యక్రమంలో

సీనియర్ నాయకులు నవార్ మల్లారెడ్డి, పుట్టగల జగన్, పెతుల ఆనంద్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్, రవికాంత్ రెడ్డి, నవార్ ప్రభాకర్ రెడ్డి, ఓం భిక్షపతి రెడ్డి, శ్రీధర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మీ నరసమ్మ, రామిడి కృష్ణారెడ్డి, రామిడి దిలీప్ రెడ్డి, పుట్టగల భాస్కర్, మధుసూదన్ రెడ్డి, పెరుమాళ్ల నవీన్ రెడ్డి, ముక్తా రేవంత్, యాదగిరి రెడ్డి, నాగార్జున, వంశీధర్, సంతోష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పదవులు ఎవరిని వరించునో!?

(1వ పేజీ తరువాయి)

ఉన్నాయి. మాజీ మంత్రి పుష్పలీల, పార్టీ సీనియర్ నాయకులు వక్కలగడ్డ చంద్రశేఖర్, సతీష్ మాదిగ సైతం తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, మాల సామాజిక వర్గానికి చెందిన సంభాని చంద్రశేఖర్ పేరు సైతం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, మాల వర్గానికి చెందిన నేతకు సీటు ఇస్తే.. మాదిగ వర్గ నేతకు పార్టీలోగానీ, ప్రభుత్వంలోగానీ ప్రాధాన్య పోస్టు ఇచ్చే అవకావం ఉందని చెబుతున్నారు. ఇక, మూడో సీటును బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన నేతకు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ కోటాలో ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నేత గుండెపల్లి దయాసాగర్‌రావు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

# జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ టాప్

**- ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లోనూ అంతే శాతం వృద్ధి - అన్ని రకాల రాష్ట్ర పన్నుల రాబడిలో 15% వృద్ధి - ఈ 6 నెలల్లో పన్నుల రాబడి రూ.44,372 కోట్లు**




హైదరాబాద్, అక్టోబర్ 1 (వన్‌నేషన్): వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో మన రాష్ట్రం మరోసారి రికార్డు సృష్టించింది. దేశంలోనే అత్యధిక జీఎస్టీ వసూళ్లు జరిగిన రాష్ట్రంగా నిలిచింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్ కూడా తెలంగాణతో సరిసమానంగా వృద్ధిని నమోదు చేశాయి. ఈ మూడు రాష్ట్రాలు సెప్టెంబరు జీఎస్టీ వసూళ్లలో ఏకంగా 18 శాతం వృద్ధిని సాధించాయి. దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఇదే అత్యధిక వృద్ధి శాతం కావడం గమనార్హం. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సెప్టెంబరు నెలకు సంబంధించిన జీఎస్టీ వసూళ్ల వివరాలను గురువారం విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. 2025 సెప్టెంబరులో రాష్ట్రం నుంచి రూ.4,512 కోట్ల జీఎస్టీ వసూలైంది. ఈ సెప్టెంబరులో రూ.5,327 కోట్లు వసూలయ్యాయి. అంటే వృద్ధిరేటు 18శాతం! ఇది జాతీయ సగటు వృద్ధి అయిన 10 శాతం కంటే చాలా ఎక్కువ. పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌మాత్రమే అత్యధికంగా ఈ 18 శాతం వృద్ధిని సాధించాయి. గుజరాత్ 17 శాతం, కర్ణాటక 16 శాతం, మహారాష్ట్ర 15 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. కాగా పలు రకాల రాష్ట్ర పన్నుల ద్వారా సెప్టెంబరు నెలలో ఖజానాకు గణనీయంగా ఆదాయం సమకూరింది. నిరుడు సెప్టెంబరు వసూళ్ల కంటే.. ఈసారి సెప్టెంబరులో 15 శాతం వృద్ధి నమోదైంది. జీఎస్టీ విలువ ఆధారిత పన్ను, ప్రొఫెషనల్ ట్యాక్స్ (పీటీ) కలిపి నిరుడు సెప్టెంబరు నెలలో 6,368 కోట్ల పన్ను రాబడి సమకూరింది.

# నేటినుంచి అందుబాటులోకి మెగా ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్

**- నేడు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల - వంటనూనెల విక్రయ కేంద్రానికి శంకుస్థాపన**



హైదరాబాద్, అక్టోబర్ 1 (వన్‌నేషన్): ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్ నేటినుంచి అందుబాటులోకి రాబోతోంది. రాజేంద్రనగర్ శివారులోని శివరాంపల్లిలో నిర్మించిన స్టేషన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించనున్నారు. దీంతోపాటు విజయ వర్ఖ్ మినరల్ వాటర్ ప్లాంటుకు కూడా ప్రారంభోత్సవం చేయనున్నారు. అదేక్రమంలో విజయ వంటనూనెల విక్రయ కేంద్రం భవన నిర్మాణపనులకు శంకుస్థాపన చేస్తారు. తుమ్మలతోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

మెగా ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్‌లో రోజుకు 200 టన్నుల నూనెను ప్యాకింగ్ చేస్తారు. పెరిగిన ఉత్పత్తి, ప్యాకింగ్ అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాన్ని ఏడాదికి 60 వేల మెట్రిక్ టన్నులకు పెంచినట్లు ఆయిల్‌ఫెడ్ అధికారులు వెల్లడించారు. రూ. 25కోట్లతో ఈ స్టేషన్‌ను నిర్మించటం గమనార్హం. కాగా ఈ ప్యాకింగ్ ప్లాంటు ద్వారానే... విజయ వర్ఖ్ మినరల్ వాటర్ ప్లాంటులోని తాగు నీటిని ప్యాకేజ్డ్ డ్రింకింగ్‌వాటర్‌గా అందుబాటులోకి తేనున్నారు. దీంతోపాటు రూ. 2కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన విజయ వంటనూనెల విక్రయ కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

# తమన్నా సినిమాకు థియేటర్లలో ప్రసాదాలు



థియేటర్లో సినిమా చూస్తున్నప్పుడు నచ్చిన పాటలకు డ్యాన్స్ చేయడం, డైలాగులకు విజిల్స్ వేయడం మామూలే. అయితే ఓ బాలీవుడ్ సినిమాకు మాత్రం థియేటర్లో ప్రసాదాలు పంచి పెడుతున్నారట. తమన్నా, సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది వన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్'. ఇందులో బిహార్‌తో పాటు ఉత్తరాది ప్రజలు జరుపుకొనే ఛఠ్ పూజ నేపథ్యంలో తమన్నాపై ఓ పాటను చిత్రీకరించారు. దివంగత గాయని శారదా సిన్హా ఆలపించిన ఓ గీతం ఆధారంగా తెరకెక్కించిన 'ఛఠీ మైయా..' అనే ఆ పాటకు ప్రేక్షకులు, ముఖ్యంగా మహిళల నుంచి మంచి స్పందన వస్తోంది. తమ సంస్కృతిని ఆవిష్కరించిన ఈ పాట తమకెంతో నచ్చిందని వారు చెబుతున్నారు. ఛఠ్ వేడుకల సమయంలో ప్రసాదంగా స్వీకరించే ఠెకువా అనే స్వీట్ కుకీలను వారు థియేటర్లలోకి తీసుకెళ్తున్నారు. 'ఛఠీ మైయా..' పాట వచ్చిన సమయంలో ఠెకువాను తోటి ప్రేక్షకులకు పంచిపెడుతున్నారు. బిహార్‌లోని ఓ థియేటర్‌కు ఛఠ్ పూజ సమయంలో ధరించే సంప్రదాయ వస్త్రధారణతో వచ్చిన ఓ ప్రేక్షకురాలు ఠెకువాను పంచుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

# 'ధర్మన్' షూటింగ్‌కి ఆటోలో వచ్చిన రజనీకాంత్.. వీడియో వైరల్

అగ్ర కథానాయకుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ సింప్లిసిటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తాజాగా ఆయన మరోసారి తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. ఆయన ప్రధాన పాత్రలో, అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న చిత్రం 'ధర్మన్'. మైసూర్‌లో జరుగుతున్న ఈ చిత్ర షూటింగ్‌కు రజనీకాంత్ ఆటోలో వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆటో దిగిన వెంటనే అభిమానులను అభివాదం చేస్తూ సెట్స్‌లోకి వెళ్లారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

రజనీకాంత్‌తో అశ్వత్ మారిముత్తుకి ఇదే తొలి సినిమా. కమల్ హాసన్ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ ఏడాది జూన్‌లో విడుదలైన రజనీ ఫస్ట్ లుక్ పోస్టర్ అంచనాలు పెంచేసింది. ఇందులో రజనీ వైద్యుడిగా కనిపిస్తున్నారు. సిమ్రాన్, రాశీఖన్నా, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

2025లో ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి దర్శకుల విషయంలో పలు మార్పులు జరిగాయి. మొదట సుందర్. సి దర్శకత్వం వహిస్తారని ప్రకటించారు. కానీ, అనివార్య కారణాలతో ఆయన వైదొలిగారు. ఆ తర్వాత 'డాన్' ఫేమ్ సిబి చక్రవర్తి పేరు ఖరారైంది. ఆయన కూడా ఈ ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చారు. చివరకు అశ్వత్ మారిముత్తు చేతికి ఈ క్రేజీ ప్రాజెక్టు చిక్కింది.

ఇక, అటు రజనీకాంత్ నటించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్-2' విడుదలకు సిద్ధంగా ఉంది. 2023లో వచ్చిన బ్లాక్‌బస్టర్ 'జైలర్'కు ఇది సీక్వెల్. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం





వహిస్తున్న ఈ చిత్రంలో ముత్తువేల్ పాండియన్‌గా రజనీ మరోసారి అలరించనున్నారు. ఈ సినిమా అక్టోబర్ 15న థియేటర్లలోకి రానుంది. ఇందులో మిథున్ చక్రవర్తి, విద్యాబాలన్, ఎస్.జె.సూర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# అశ్లీల సన్నివేశాలు.. అలాంటి సినిమా ఇప్పుడైతే చేయను: అమలాపాల్



తమిళ చిత్రం 'ఆడై' 2019లో విడుదలై సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ మూవీని తెలుగులో 'ఆమె'గా రిలీజ్ చేశారు. ఇందులోని ఓ కీలక సన్నివేశంలో నటించేందుకు తాను తీసుకున్న రిస్క్ గురించి నటి అమలాపాల్ తాజాగా వెల్లడించారు. ఇప్పుడు అలాంటి అవకాశం వస్తే.. కచ్చితంగా తిరస్కరిస్తానని స్పష్టం చేశారు.

"ఈ సినిమాలో నటించాలంటే చాలా భయమేసింది. దర్శకుడు రత్నకుమార్ ఆ సున్నితమైన అంశాన్ని ఎలా డీల్ చేస్తారో అనిపించింది. కథ కాకుండా కేవలం ఆ బోల్డ్ అంశంపైనే దృష్టి పెడతారేమోనని భయపడ్డా. చిత్రబృందం ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవడానికి నాకు దాదాపు రెండు నెలల సమయం పట్టింది. ఈ సినిమాలో నటిస్తే నా ఇమేజ్ ఏమవుతుందోనని చాలా ఆలోచించా. ఇలాంటి పాత్రలకే నన్ను పరిమితం చేస్తారేమో అనుకున్నా. దర్శకుడు, సినిమాటోగ్రాఫర్‌పై పూర్తి నమ్మకం వచ్చాకే ఈ ప్రాజెక్టుకు ఓకే చెప్పా. ఆ అశ్లీల సన్నివేశం చిత్రీకరణ సమయంలో.. సెట్‌లో అతి తక్కువ మందితో నాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకున్నారు" అని అమలాపాల్ గుర్తుచేసుకున్నారు. రత్నకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కామిని అనే టీవీ జర్నలిస్ట్‌గా అమలాపాల్ కనిపించారు.

# హలో తెచ్చిన గందరగోళం



కొత్తదనం నిండిన పాత్రల్లో నటిస్తూ తనదైన హావభావాలతో సినీ ప్రియుల్ని మెప్పిస్తోన్న మమితా బైజు వరుసగా విజయాలు అందుకుంటూ కెరీర్‌ని పరుగులు పెట్టిస్తున్నారు. అగ్రతారలతో కలిసి తెరపై సందడి చేస్తున్నా.. కథ కుదిరితే యువ హీరోలతోనూ నటిస్తున్నారు. మమిత, నటుడు సంగీత్ ప్రతాప్ జంటగా నటిస్తున్న సినిమా 'హలో డియర్'. డినోయ్ పాలోస్ దర్శకత్వం వహిస్తుండగా ఆషిక్ ఉస్మాన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. 'ఒక హలోతో ఏర్పడిన గందరగోళ ప్రేమకథ' క్యాప్షన్‌తో ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌తో ఈ చిత్రాన్ని రొమాంటిక్ కామెడీగా రూపొందిస్తున్నట్లు స్పష్టం చేసింది చిత్రబృందం. ప్రస్తుతం మమిత.. హీరో ప్రదీప్ రంగనాథన్ నిర్మాణంలో రూపొందుతున్న చిత్రంతో పాటు పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. విష్ణు విశాల్ సరసన ఆమె నటించిన 'ఇరండు వానమ్' అక్టోబరు 23న విడుదల కానుంది.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**